# మాలతి పెళ్ళి

"ఏమేవ్!... నీ కేదో పెళ్ళి శుభలేఖ వచ్చిం" దంటూ మా వారు వీధిలోంచే కేక వెయ్యగానే, ఉతుకుతూన్న బట్టలు అక్కడ పడేసి చేతులు కడుక్కొని చీర చెంగుతో తుడుచుకుంటూ ఒక్క అంగలో వీధిలోకి వచ్చాను.

"ఏమండీ!... ఏదీ?... నా పేరనే వచ్చిందా?" — అంటూ ఆత్రంగా అడిగాను; నా పేర ఇంతవరకూ యిలాటి శుభలేఖలు రావటం యిదే మొదలవటంచేత"

"ఆ!...నీ పేరే వచ్చింది!... ఇన్నాళ్ళికి నేను కేరఫ్ గాడికింద జమ అయ్యాను...' అంటూ నవ్వుతూ మా వారు నాకు ఆ శుభలేఖ అందించారు.

గబగబ అది కవరు చించి తీసి చదువుకున్నాను.

"ఆ!...మాలతికి పెళ్ళా?..." అన్నాను అప్రయత్నంగా!

"ఏమిటే?...ఎవరిది పెళ్ళి?... ఎవరా మాలతి? అంటూ మా వారు ప్రశ్నించారు.

"మీకు తెలవదులెండి మాలతిని..."అని ఏమేమో చెప్పబోయేసరికి యింతలో బాబిగాడు కాళ్ళకడ్డంబడి ఏడుపు ప్రారంభించాడు. వెంటనే వాడిని ఎత్తుకుని సముదాయించడానికని దొడ్లోకి వెళ్ళిపోయాను.

మా వారు అప్పుడే ఆఫీసునుంచి యింటికి రావడంచేత ఆ డ్రెస్ మార్చి యింకో డ్రెస్ వేసుకుంటున్నారు. బాబిగాడ్ని సముదాయించి ఆయనకు కాఫీ కలిపిద్దామని ఫ్లాస్కు దగ్గిరకెళ్ళాను - ఫ్లాస్కు తీసి క్రింద పెట్టి గ్లాసు తెచ్చి పక్కనే పెట్టాను.

"అరెరె! బుజ్జి సబ్బంతా తగలేస్తోంది! దీన్ని లోపలికి తీసికెళ్ళవే," అంటూ పంపుదగ్గర కాళ్ళుకడుక్కుంటూ ఆయనగారు ఒక్క కేక పెట్టారు.

వెంటనే లేచి పంపుదగ్గర కెళ్ళాను. నన్ను చూడగానే అయిదేళ్ళ ముద్దు......ఆ బుజ్జి పరుగు ప్రారంభించింది. రెక్క పుచ్చుకుని ఒక్క గుంజు గుంజి తీసికొచ్చి యింట్లో పాలేశాను. దాంతో అది అరున్నొక్క స్వరంలో దీర్ఘం ప్రారంభించింది. ఆయన యెక్కడ విసుక్కుంటారో అని దాని ముందు యింత బెల్లంముక్క పడేశాను. ఇంతలో ఆయన కాళ్ళు మొహం కడుక్కుని వంటింట్లోకి వచ్చారు.

"అరె!......ఫ్లాస్కు క్రిందపెట్టి గ్లాసు పట్టుకు తిప్పుతావేమిటే!" అని ఆయన హెచ్చరించేదాకా నేను చేస్తున్నదని నాకే తెలియలేదు. ఫ్లాస్కును వదిలేసి మతిపోయి గ్లాసును పట్టుకుని మూతతీయబోతే ఎలా వస్తుంది?......

"అయ్యో!... నా మతిమండా!" అనుకుని వెంటనే ఫ్లాస్కులో కాఫీ ఆయనకు పోసియిచ్చాను. ఆయన దాన్ని తాగుతూ పడకగదిలోకి వెళ్ళిపోయారు! ......మిగిలిన కాఫీ గ్లాసులో పోసి బుజ్జిముందు పెట్టాను.

---

"శాంతిశ్రీ"

---

"విమలా!...యిలారా!...ఓసారి!..." అంటూ ఆయన ఓకేక పెట్టారు...

కాఫీ అయిందికాబోలు యిక చక్కెర డబ్బాకోసం కేకలేశారేమోనని నేను వెళ్ళాను.

"అయితే యింతకూ ఆ మాలతి యెవరే!..." అంటూ ప్రశ్నించారు...

"ఎవరంటే ఏంచెప్పనండి?...ఏంచెప్తే మీకర్థమవుతుంది? అదకూడా నాలాగే ఓ ఆడపిల్లే..." అన్నాను అదోలా!

"అయ్యో! అలాగా!...నాలాగే మొగవాడేమోననుకున్నాను... అయినా నువ్వు యింకా చిన్నపిల్లవయినట్లు మాట్లాడుతున్నావేమిటి పిల్లల తల్లివయి కూడా!..." అంటూ ఆయన నన్ను దెప్పి పొడిచారు.

"చాల్లెండి, మీ వేళాకోళం! పెళ్ళికాకపోతే యింకా పిల్ల అనే అనరా?..." అన్నాను నా వాదాన్ని సమర్థించుకుంటూ!

"సరెలే! పోనీ, యింతకూ ఆ ఆడపిల్లే, ఏ ఊరని?" అంటూ మళ్ళీ అడిగారు

"ఓహోహో! నన్ను విడిచిపెట్టేటట్టు లేరే!" అంటూ విసుక్కోబోయాను.

"అంత కోపమయితే వద్దులే! పోనీ, ఒకవేళ ఆ పెళ్ళికి వెళ్ళాల్సి వస్తుందేమోనని. వెళ్ళక్కర్లేకపోతే పేచీయే లేదు... అన్నారాయన.

"అయ్యయ్యో. ఎటక్కపోయి విసుక్కున్నానే" అని మనస్సులో అనుకుని,

"అబ్బే అది కాదండీ. ఆ మాలతిది మా ఊరే. మా యింటికి యెదురుగుండా ఉండేది. మీరు చూశారేమో కూడా" అన్నాను. పాపం, మా వారు వట్టి అమాయకులు! అంత కోపం చప్పున చల్లారిపోయింది.

"ఓహో, ఎఱ్ఱగా కోలగా మొహం, సన్నటి ముక్కు ఆ అమ్మాయేనా..." అంటూ ఆయన క్షణంలో తన మనస్సులో ఉన్న మా మాలతి రూపురేఖా చిత్రాన్ని నాకు వర్ణించి చెప్పేశారు.

"ఆ!...ఆ!...అదే!...దానికే పెళ్ళి..." అన్నాను నేను.

"అరె!...ఆ! అమ్మాయికా? పెళ్ళి... అదేమిటే?...ఎన్నేళ్ళుంటాయి యిప్పుడు" అంటూ ఆశ్చర్యంగా అడిగారు.

అవును. అందులో తప్పేం లేదు, ఆయన ఆశ్చర్యంగా అడగటంలో. నేను ఆశ్చర్య పడవలసిన విషయం లేదు. కారణమేమిటంటారా?...అదిగో యిదిగో అని అప్పుడే నా పెళ్ళయి పదేళ్ళు కావస్తోంది... అంటే నా పదిహేనో యేట పెళ్ళయింది. మాలతి అప్పటికి నా యీడుదే! అందుకని ఆయన గారలా అడిగారు.

"సరే!...పాపం, అప్పటినుంచి దానికి పెళ్ళికాలేదు. నా వయస్సే ఉంటుంది" అన్నాను.

"అయితే అదృష్టవంతురాలే! యిప్పటికేనా కళ్యాణం చేసుకొంటోంది!" అన్నారు నవ్వుతూ మా వారు.

"అది చేసికొనేదేమిటండీ? అంతా చిత్రంగాని. పాపం, అదేం ఖర్మోగాని దానికి యెన్నాళ్ళకీ సంబంధాలు కుదరందే," అన్నాను జాలిగా.

"పోనే, యిప్పటికి కుదిరిందిగా!" అన్నారు మా వారు.

అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయింది. ఇంట్లో పనిచేసుకొందుకు నేను వెళ్ళిపోయాను. ఆయన కూడ షికారుకని ఊళ్ళోకి

# ★ మాలతి పెళ్ళి ★


వెళ్లిపోయారు. రాత్రి ఏడు గంటలకు భోజనాలు ముగించి వంటిలు గబగబ సర్దేసి పక్కా వచ్చాను. ఆయనగారేమో ఏదో ఆఫీసు పనుందంటూ వీధిగదిలో కూర్చుని ఆ ఆఫీసు కాగితాలు - కాగితాలేం ఖర్మం - కాగితాలకట్టలు-ముందేసుక్కూర్చున్నారు. బుజ్జి నాలుగుమెతుకులు నోట్లో పడగానే అక్కడే అపక్కనే నేలమీదే ఒరిగింది. వెంటనే దాన్ని తీసి పడుకోబెట్టే వ్యవధి లేకపోయింది. అందుకని దానికి పక్కనే దాన్ని లేవతీసి పడుకోబెట్టాను. ఇంతలో ఉయ్యాల్లో బాబిగాడు, అటు యిటు కదలసాగాడు. ఓసారి ఉయ్యాల ఊపి యివతలకు రాబోయాను.

"ఏమే!...మంచినీళ్లు పట్రా!"-అంటూ ఆయనగారు వీధిగదిలోంచి ఆర్డరు జారీచేశారు. మరచెంబుడు మంచినీళ్ళు ఓ గాసు తీసికెళ్లి ఆయనగదిలో పెట్టి తలుపు దగిరగా వేసి వచ్చి పడుకున్నాను. అమ్మయ్య ఇప్పటికి తీరిక చిక్కింది...ఛా! ఛా! మాలతి పెళ్ళిశుభలేఖ సరిగ్గా చదవనన్నా లేదే... వెంటనే పక్కమీదనుంచి లేచాను. లైటు వేశాను. వంటింట్లో పోపుల పెట్టెలమీద పెట్టిన శుభలేఖ తీసికొచ్చి మళ్ళీ మళ్ళీ చదివాను. ఎన్నిసార్లు చదివితే మాత్రం ఏం లాభం? ఏముంటుంది అందులో! అన్నీ ఒకటే మాసరుగా! శ్రీరస్తుతో ప్రారంభించి మంగళం మహత్ శ్రీశ్రీశ్రీ వరకూ అంతా ఒకటే అచ్చు! ఇకపోతే మారేదల్లా ముహూర్తము. వధూవరుల పేర్లు. మాలతి కొక్కబోయే భర్త పేరు చదివాను... వామనరావు...అని ఉంది. పక్కనే బి. ఏ. బి. ఇడి. అని కూడా ఉంది. మాలతిభర్త యెలా ఉండి ఉంటాడా అని ఊహించసాగాను. పేరు బట్టి మానే పొట్టిగా ఉండడుకదా కొంపతీసి!...అసలే వన్నెం. అందులో పొడుగు. ఆజానుబాహురాలు!...అలాంటి దానికి యీ పొట్టివాడైతే!

ఆ! పేరు వామనరావైనంత మాత్రాన మనిషి పొట్టిగా ఉండాలని ఎక్కడుంది?...అసలామాటకొస్తే మనిషి పేరుకీ మనిషి వ్యక్తిత్వానికీ సంబంధం యెక్కడుంది యేడిసింది ఈ రోజుల్లో. ఆనందరావని పేరేగాని. అతన్ని ముఖంలోగాని, జీవితంలోగాని ఎన్నడూ ఆనందం కనపడదు ఒక్కొక్కడికి! సుమతి దేవిఅని పేరుపెట్టుకుంటుందేగాని పాపం ఆ చిన్నదానికి అసలు మతే ఉండి యేడవదు ఒక్కొక్కతెకు నాలాగ!......అలాగ పేరుబట్టి భయపడక్కరేదు. అలాగని నిర్లక్ష్యం చేయనూకూడదు...కొందరు సార్థకనామధేయులుంటారు. నేను చదువుకునేటప్పుడు శాంతాదేవిగారనే టీచరుండేది. ఆవిడ దగరున్నంత శాంతం యింకెవ్వరిలోను మనం చూడబోము. సరే యీగొడవకేం?... మాలతిభర్తనుగురించి ఆలోచిస్తూ పడుకున్నాను. దానిభర్త యెలా వుంటాడా అని ఆలోచన ప్రారంభించేసరికి మాలతి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. చిన్నతనంలో మాలతి అనేది తనభర్త సన్నగా నాజూగ్గా, పొడుగ్గా, అందంగా ఉండి, చక్కగా సూటు వేసి, గడియారం పెట్టి, రిమ్‌లెస్ కళ్ళజోడు పెట్టాలని చెప్పేది... మరి యీ వామనరావు దానికోర్కె ప్రకారం లభించాడో లేదో!... ఏమిటో యిలా ఆలోచిస్తుంటే మనస్సు మళ్లీ పన్నెండేళ్ళ వెనక్కి పోయింది.

అప్పుడు నాకు పదమూడు యేళ్ళు. మాలతికి పదమూడు యేళ్ళే. మాలతి మాయింటి యెదురుగుండా ఉండేది. అసలు ఆమాటకొస్తే మాలతి మాకు కొంచెం దగర చుట్టమే. ఇకపోతే మాయింటి పక్కన డాక్టరుగారు...వాళ్ళమ్మాయి సరోజా మాయీడుదే. అంటే మేంముగ్గురం ఒకయీడు వాళ్ళం...ఇంచుమించు నెలల తేడాలో ముగ్గురం ఒక్కసారే పెద్దమనుషులయాము. పాపం మాలతి తల్లి ఎప్పుడో చనిపోయింది.

మాలతికి అక్కయ్య, అన్నయ్య, తండ్రి ఉన్నారు అప్పటికే మాలతి అక్కయ్యకు పెళ్ళయి కాపరానికి వెళ్ళిపోయింది. అందుకని యిక యింట్లో వంటా వార్పు అంతా మాలతే తండ్రికి అన్నయ్యకి అన్నంవండి పెటటమే మాలతి పనైపోయింది. ఇక మాపనో: నా కుటుంబకు నాకు యిదరు అక్కయ్యలు ముగ్గురన్నయ్యలు ఉండడంచేత అమ్మనాన్న నాచేత ఏపని చేయించేవారు కాదు. ఇక సరోజసంగతి సరేసరి. డాక్టరుగారమ్మాయేమో. పైగా సరోజతల్లికి సరోజంటే అతి గారాబం. సరోజకు ఒక అన్నయ్య మాత్రమే ఉన్నాడు. ఇలా ఉండగా నాకు మాత్రం నాన్న సంబంధాలు వెతకటం ప్రారంభించాడు, మాలతి నాన్న ముందు చొరవగా సంబంధాలు వెతకటానికి బయలేరలేదు. కారణం...! మాలతి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోతే తమకు వంటచేసి పెట్టేవాళ్ళెవరని. ఇక సరోజ తండ్రి-డాక్టరుగారు అంత శ్రద్ధచూపలేదు. కారణం ఆయన భార్య! ఆవిడకు యెంతసేపూ కూతురిమీద వ్యామోహమే. పెళ్ళయితే యెక్కడ కాపరానికి వెళ్ళిపోతుందోనని సంబంధాలు వెతకనిచ్చేది కాదు. ఒకవేళ కుదిరినా కూతురు మాత్రం తనదగరే ఉండాలనేది. ఆవిడగారే కొడుకు పెళ్ళిచేసి కోడల్ని కూడా తనదగరే ఉండిపోవాలని శాసించింది. తన కోడలు కూడ ఓయింటి ఆడబడుచేనని జ్ఞానం ఆవిడకు పాపం లేకపోయె! ఈ పరిస్థితులలో రెండేళ్ళయేసరికి నాకు మావారితో సంబంధం నిశ్చయమయి పోయింది. పెళ్ళికూడ జరిగిపోయింది. అప్పటికి మాలతికి, సరోజకు సంబంధాలు కుదరనన్నా కుదరలేదు. సరోజ అన్నయ్యకు మాత్రం పెళ్ళయింది. సరోజ తల్లి కోడల్ని దగ్గరే ఉంచుకుంది!... నేనిలాగ నేను కాపరానికి వచ్చేశాను. ఆ తర్వాత మరుసటి సంవత్సరమే సరోజకు పెళ్ళిచేశారు. డాక్టరుగారి భార్య యిష్ట ప్రకారమే అల్లుడు అత్తవారింటి దగ్గర ఉండసాగాడు. ఆవిడగారు కోడల్ని ఒక్కసారి పుట్టింటికి పంపించడానికి కూడా యెంతో బాధపడేది. రెండేళ్ళకి మేమిద్దరం చంటిపిల్లల్ని కన్నాము. మాలతికి యింకా అప్పటికీ యెక్కడా సంబంధం కుదరలేదు...మా పెళ్ళికి పూర్వం మేం ముగ్గురం కూర్చుని "నీ మొగుడు యెలా ఉంటాడంటే నీ మొగుడు ఇలా ఉంటాడని ఏడిపించుకునేవాళ్ళం. అదృష్టవశాత్తు నాకు మాత్రం వాళ్ళు ఏడిపించినట్లుగా లేరు మావారు... సరోజకు అతురాలా అనుకొన్న మొగుడే దొరికాడు...అంత అందగాడు కాకపోయినా అనాకారి మాత్రం కాదు...అంత తెల్లని తెలుపు కాకపోయినా నల్లని నలుపు మాత్రం కాదు...అంత మరీ పొడుగు కాకపోయినా వామనమూర్తిలా పొట్టి కాదు...


అంత లావు కాకపోయినా కొంత మనిషి మాత్రం ఒకటే!– చీటికీం మాటికీ!... అవసరమని మా సరోజకి సిగరెట్లిచ్చా, సిగరెట్లు కాల్చేవాళ్ళన్నా తగని ఒళ్ళుమంట...ఇక అలాంటిది చుటలు సంగతి వేరే చెప్పాలా! అదేం అదృష్టమో కాని, దాని మొగుడికి పెళ్ళయ్యేనాటికి పట్టుమని పదిహేనేళ్ళన్నా లేవు. ఆ వయస్సులో పాడు చుట్టలు అలవాటు అయ్యాయి. ఎవరికైనా అలవాటయితే సిగరెట్లు అలవాటవుతాయి ఆ వయస్సులో. ఆయనగారు పెళ్ళిపందిట్లో, పెళ్ళయ్యాక లంకపొగాకు చుట్ట వెలిగించి తుపుకు తుపుకుమని ఉమ్మేస్తుంటే నాకే చిరాకేసింది. ఇక పాపం, ఆ సరోజ యెంత బాధపడి ఉంటుందో! ఈవిధంగా ముందు నా పెళ్ళి, మరో సంవత్సరానికి సరోజ పెళ్ళి అయ్యాయి. మాలతి మా యిద్దరి పెళ్ళిళ్ళకు మంగళహారతి పాటలు పాడింది. మళ్ళీ దర్శి అత్తవారింటికి సాగనంపింది అంతరంగంలో అమాయకంగా బాధననుభవిస్తూ. కాలచక్రం దొరికిపోకమానుతుందా? అయిదారు ఏళ్ళవరకు మళ్ళీ మాకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగలేదు. ఉద్యోగరీత్యా మావారు అనేక ఊళ్ళు తిప్పారు నన్ను. నా జన్మలో చూస్తాననైనా ఊహించని ఢిల్లీ, కలకత్తా ...ఒకటేమిటి, మన భారతదేశ కీలక స్థానాలన్నీ చూశాను. చూడ్డం ఏంఖర్మం...కాపురమే ఉన్నాను కొన్ని నెలలు. అలా అలా కొంతకాలంపోయాక ఓసారి – అంటే మా శ్రీకాంత్ బాబిగాడ్ని కడుపులో ఉండగా పురిటికి యింటికెళ్ళాను. అప్పటి పరిస్థితి ఎంత విషాదకరంగా తయారయిందో తలుచుకుంటే కడుపు తరుక్కుపోతుంది. మాలతికి యింకా పెళ్ళికాలేదు. పోనీలే!– ఆ కళ్యాణఘడియ యింకా కలిసిరాలేదు అని అనుకున్నాం. అంతకన్న అతిదారుణమైనది ...సరోజ భర్త చనిపోయాడు. ఊరు చేరగానే యీ వార్త తెలిసేసరికి కొయ్యబారిపోయాను. సరోజ నెలా ఓదార్చాలో అర్థంకాలేదు. అప్పటికే దానికిద్దరు పిల్లలు. ఒక ఆడపిల్ల, ఒక మొగపిల్లాడు...అంతా పైకి విచారించినా, లోలోపల మాత్రం కొంతవరకు సరోజ తల్లిని ఆడిపోసుకొన్నారు...కాకపోతే ఏమిటి చెప్పండి. ఎంత మమకారమైతే మాత్రం?—ఎంత కూతురైతేమాత్రం?...పెళ్ళిచేసిన తర్వాత అత్తవారి యింటికి పంపించదూ?...ఏదో అమాయకపు అల్లుడ్ని చేసి యిల్లరికం ఉంచుకుంటుందా?...పోని తన కూతురిలాంటిదే తనకోడలుకూడా అని ఎన్నడైనా తలచిందా?...తనకు, తన భర్తకు, కూతురికి, అల్లుడికి చాకిరీ చెయ్యటానికి, కోడలు యెల్లకాలం యింటిలో ఉండాలా?...ఇదేమన్నా న్యాయంగా ఉందా? కూతురు ఎప్పుడూ తన దగ్గర ఉండాలని కోర్కె ఆవిడగార్కి దైవము తగినశాస్తి చేశాడు... శాశ్వతంగా యిక పాపం ఆ చిన్నదాని జీవిత దీపాన్ని ఆర్పేసి, దానికడుపులో ఆరని చిచ్చు పెట్టి ముసుగేసిమూల కూర్చోబెట్టాడు...ఇక యెంత అఘోరిస్తే ఏంలాభం! చూడండి, దైవలీలలు!... ఒక తెరు యింకా పెళ్ళికాలేదు... కాకేమో వణుకుడు పిల్లలు...పాపం దాని కష్టాలే జీవితంలోని అతిముఖ్య ఘట్టాలన్నీ పూర్తియిపోయాయి. విధి విలాసం అంటే యిలాగే ఉంటుంది కాబోలు! ఆ ఊళ్ళో అప్పుడు ఒక్క క్షణం ఉండ బుద్ధియ్యలేదు...ఎలాగో ఆ పురుడు పుణ్యాలు పూర్తిచేసికొని నెలాళ్ళలో తిరిగి మా వారి దగ్గర కొచ్చేశాను...ఆ తరువాలాని మళ్ళీ అక్కడి విషయాలు అంతగా తెలియలేదు...ఇవాళ అనుకోకుండా మాలతి పెళ్ళి శుభలేఖ వచ్చింది. ఇన్నాళ్టికి దాని జీవితంలో ప్రథమముఖ్యఘట్టం జరిగే అదృష్టం కలిందన్నమాట...ముహూర్తం యింకా మూడు రోజులుంది. ఏమైనా తప్పకుండా వెళ్ళి తీరాలని అనుకున్నాను...అంతలో వంటింట్లో యేదో ఢభేల్మని చప్పుడయింది... "పీడ దుంపతెగ! తెగ ప్రాణం తీస్తున్నాయి..." అని విసుక్కుంటూ తలుపు తీసి చూద్దునుగదా పాడుపిల్లి పెరుగుమూత పడదోసి యెంత నాకేసినా కదురయింది...దాన్ని అవతలకు కొట్టేసి తలుపు గొళ్ళెంపెట్టి యివతల కొచ్చేసరికి బాబిగాడు లేచేశాడు. వాడికి కాసిని పాలు పట్టించి పడుకోబెట్టేసరికి కళ్ళమీదకు నిద్ర ముంచుకొచ్చింది. వెంటనే పక్కమీద వాలాను యిక ఆ రాత్రికి!

తెల్లారి లేచి యథాప్రకారం పనులన్నీ పూర్తిచేయసాగాను. ఆ సాయంత్రం ఆయన ఆఫీసునుంచివస్తూనే నాకో కవరు అందించారు. తీరా విప్పి చూద్దునుగదా అది మాలతి దగ్గర్నుంచే వచ్చింది.

"విమలకు,

విమలా!...నిన్నటే మావాళ్ళ పోస్టులో నీవు శుభలేఖ అందుకొని ఉంటావు...అరవై యేళ్ళువచ్చాక దగుపుకోక మున్నే కట్టుకోనా అన్నట్టు, పాతికేళ్ళ పైబడాక యిప్పుడు ఈ పెళ్ళి నిజానికి చేసుకోవాలని లేదు...కాని ఏం చెయ్యను? లోకాచారవ్యవహారాలననుసరించి చేసుకోక తప్పదుగా! అందుకని నాన్నమాట కాదనక యీ పెళ్ళికి ఒప్పుకున్నాను...ఎక్కువగా ఎవర్నీ పిలవటం లేదు...నిన్ను తప్పకుండా పిలవాలని, నీవు తప్పకుండా [మీవారితో, పిల్లలతో సహా] రావాలని మూడురోజులు ముందుగానే నీకు పోస్టుచేయించాను...మన చిన్నతనంలో

(47-వ పేజీ చూడండి)



శ్రీశైల ఆలయ గోపురం.

# ★ మాలతి పెళ్లి ★

(23-వ పేజీ తరువాయి)

మనం అనుకున్న మాటలు నీకు గుర్తున్నాయిగా!...మాలతీ! మనలో ఎవరి పెళ్ళి ఎప్పుడయినా మిగతా వాళ్ళు యిద్దరు యెక్కడున్నా యెలాఉన్నా హాజరయితీరాలి," అని అన్నావు. జ్ఞాపకముందా?... నరోజ యిక్కడే ఉంది, అంతా ఖర్మ!...దాని బ్రతుకు అలా బ్రద్దలయిపోయింది...... వ్రాయాలంటే యిలా చాలా ఉంటాయి. మనసు విచ్చే మనుష్యులతో మనసు విప్పి మాటాడితేనే మహదానందంగా ఉంటుంది. కాని శీఘం కలిగే ఆ మాటల్ని ప్రాణంలేని వ్రాతల్లో వ్రాస్తేవాని విలువ నశించిపోతుంది. అందుకని నీవు పెళ్ళికి ఒకరోజు ముందే బయలుదేరివస్తావని ఆశిస్తున్నాను... పిల్లలందర్నీ తీసుకొనిరా! మీవారిని కూడ బయలుదేరదిస్తావుకదూ! _నీకోసం చూస్తూ ఉంటాను...సెలవు

— నీ మాలతి."

ఉత్తరం చదివి మడిచి కవరులో పెట్టాను... ఇంతలో డ్రస్ మార్చుకుని వచ్చిన ఆయనగారు 'ఉత్తరం యెక్కడినుంచే?' అన్నారు.

'మా మాలతే వ్రాసిందండీ!...' అన్నాను అత్యంతానందంతో !_

"ఏం వ్రాసిందీ?...పెళ్లికిముందే బయల్దేరి రమ్మని వ్రాసిందా?" అంటూ అప్పుడే ఆయన గ్రహించేసినట్టు అన్నారు.

"మరేనండి పాపం, రమ్మని మరీమరీ వ్రాసింది!..." అన్నాను.

'అయితే ఇంకేం? బయల్దేరు. తప్పుతుందా మరి?" అంటూ ఆయన తన అంగీకారాన్ని తెలియజేశారు.

అమ్మయ్య! ఆయనగారి అంగీకారం వచ్చేసింది. ఇక మనం బయలేరవెళ్ళడమే! అర వామర్థిమందా ఆయన్నికూడ మరీమరీ రమ్మని వ్రాసిందే.

'ఏమండీ!...అన్నట్టు మిమ్మల్ని కూడా రమ్మని మరీమరీ వ్రాసిందే' అన్నాను గబగబ!

'ఆ!...వాళ్ళకూడ రాసింది మరీమరీ!..' అన్నారాయన నవ్వుతూ.

'సెలవుపెట్టి మీరుకూడ రండీ! పాపం!" అన్నాను.

"ఆ, నేనెందుకే. పిల్లల్ని తీసుకొని నువ్వెళ్ళు" అన్నారు.

ఇంతలో పెద్దాడు స్కూలునుంచి రావడంతో వాడికి టిఫిను పెట్టటానికి వెళ్ళాల్సొచ్చింది. తెల్లారి పొద్దున్నే ప్రయాణం పెట్టుకున్నాను. రాత్రంతా బట్టలు సర్దుకున్నాను. దానికేం కానుక ఇవ్వాలాని ఆలోచించాను. దానికి నీలం జారీటు చీర అంటే మాచెడ్డ ఇష్టమని వెనక ఓసందర్భంలో చెప్పింది. వెంటనే గుర్తొచ్చి వీరాజ్ని బజారు పంపించి బట్టలకొట్లో వెదు ప్రాయించి ఆచీర, జాకెట్టుగుడ్డ తెప్పించాను. అన్నీ సిద్ధంచేసి పడుకున్నాను. అయిదింటికే అలారం పెట్టి పడుకున్నాను. ఏడింటికి రైలు. అలారం విని లేచి పిల్లల్ని లేపి ఒక్కొక్కళ్ళనే మొహాలు కడిగిస్తున్నాను.

"అమ్మా!...... ఈ జాకెట్టు తొడుక్కోనా!" అంటూ బుజ్జిదానికి రాలోయింది ... ఏంచెప్పమంటారు!... అంతా విశ్వామిత్రకని.

"......రాదు!......రాదు! దూరంగా ఉండు!..." అంటూ దాన్ని కసిరాను...

ఇంతలో ఆయనగారు లేచారు.

"అదేమిటే! ... యింకా అలా ఉంచున్నావేం? ... టైమవటంలేదూ!......" అంటూ అడిగారు...అనుకున్నంతా అయింది!...వారు వట్టి అమాయకులు!

"ఏంలేదు కానీండి!...ముందు మీరు కాలకృత్యాలు తీర్చుకోండి! మీ కేనా బయల్దేరి వెదుదురుగాని," అన్నాను...

"ఓహో! ...అదా సంగతి!...అర్థమయింది!..." అంటూ ఆయన గబగబా మొహం కడుక్కున్నారు.

ఈలోగా పెద్దాడిచేత బట్టలు సర్దించి సంచిలో కొత్తచీర, రవికెలగుడ్డ పెట్టించి ఆయనకూడా బుజ్జిని పంపించాను. మనం ఒకపని చెయ్యాలని ఎంతగా ఆరాటపడతామో అంతగానే నిరాశ చెందుతాము ఒక్కొక్కప్పుడు!...మా యిద్దరి పెళ్ళిళ్ళు చేయించిన—అదే దగ్గరుండి జరిపించిన దాని పెళ్ళికి—మా మాలతి పెళ్లికి నేను వెళ్ళలేకపోయానుకదాని నేను విచారించసాగాను. పోనీ నరోజేనా వెడుతుందా అంటే...అదలా వెడుతుంది!...దాని ఖర్మ అలా కాలిపోతే. దాని అదృష్టం అంతే, అనుకున్నాను.

రెండురోజుల తర్వాత ఆయనగారు తిరిగి వచ్చారు. నేను రానందుకు మాలతి యెంతగానో యేడ్చిందిట. పెళ్ళికొడుకు యేమంత బాగుండడుట...అందులోనూ రెండో పెళ్ళిట...ఏమిటేమిటో మావారు పెద్ద విశేషాలు చెప్తుంటే నాతల తిరిగిపోయింది.. దాని జన్మకాల నక్షత్ర ప్రభావం అంతేనేమో అనుకుని ఒక్క నిట్టూర్పు విడిచాను.

★

## అసాధారణ చికిత్స

అనేక సంవత్సరాలనుండి చర్మ రోగులను మా వారు అసాధారణచికిత్స అనేక రోగనివారించుటకు. ఇంకొక వర్మ వ్యాధులకు కూడా చికిత్స చేయబడును.

సంప్రదించండి:

అశోక్ స్కిన్ క్లినిక్

1/200, తంకసాల వీధి,

(రాముని గుడిదగ్గర) మద్రాసు-1.

శని, ఆదివారాలలో మాత్రం పనిచేయును.

## తరచుగా మూత్రవిసర్జన

తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైనదివ్యాధి. శరీరాన్ని గుల్లచేయుటయేకాకుండా యీ వ్యాధి. సకాలంలో చిక్కిన వారిని అరోజుకారోజు మృత్యువుకు అర్పించి చేయును. ప్రధమదశలో శారీరక మానసికశక్తులను యిన్వగింపజేయును, నరములలో నొప్పి చూపు మాంద్యము, కాళ్లలో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో. అధికదాహం, ఆకలి, గొంతు పొడారిపోవుట, దురదలు, కాళ్ళలో వళ్ళు తూకంతగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు కూడా సంభవించవచ్చును.

"వీనస్ ధారమ్" మాత్రలు వాడి, అనేక వేలమంది సమబాధల నుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి. "వీనస్ ధారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల, శాకపదార్థముల, ధ్యాక్వాని క్షీరముల సారముతో తయారైనవి. "అమిత దాహం తగ్గి.... పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము, 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ధారమ్" కొద్దివ్యయముతో. సులభముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు నిరాహారముతో ఉండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే యెక్కువరకాల ఆహారపదార్థములు తినవచ్చును. వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును

ధర: 50 మాత్రల సీసా రు. 6-75

ప్యాకింగు పోస్టేజి ఉచితము

లభించు స్థలము:

Venus Research Laboratory (A.P.W)

P. O. Box No. 587, Calcutta.